ప్రజాశక్తి
శుక్రవారం 30 మే 2025
5
పార్వతీపురం మన్యం

కలెక్టర్‌ను కలిసిన డిఐఇఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డిఐఇఒ) గా వై.నాగేశ్వర రావు నియమితుల య్యారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంటర్ విద్యా ప్రమాణాలు మెరుగు పరచడం, మంచి ఫలితాలు సాధించడం పట్ల దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు బొకేను అందజేస్తున్న డిఐఇఒ నాగేశ్వరరావు

గిరిజన సంక్షేమశాఖలో బదిలీల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న గిరిజన సంక్షేమ శాఖలో బదిలీల అలజడి మొదలయ్యింది. ఇప్పటికే ఉపాధ్యాయులు, నాలుగో తరగతి సిబ్బంది ఎప్పుడు బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందానని ఎదురుచూసిన వారికి ఊరట లభించింది. అయితే ఈ నెల 23న కూటమి ప్రభుత్వం బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలని పచ్చజెండా ఊపింది. దీంతో ఉపాధ్యాయులు బదిలీల సందడిలో నిమగ్నమయ్యారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 47 ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి 191 జిపిఎస్ పాఠశాలలో నుంచి ప్రధానోపాధ్యాయులు. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటి ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవచ్చు. అదేవిధంగా ఈ పాఠశాలల పరిధిలో నాలుగో తరగతి సిబ్బంది కూడా దరఖాస్తు చేసుకోవచ్చని గిరిజన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ నిబంధన ప్రకారం ఐదేళ్లు పైబడిన ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి, సిబ్బందికి బదిలీ తప్పనిసరి. గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈనెల 24 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించారు. బుధవారం దరఖాస్తుల పరిశీలన జరిగింది. శుక్రవారం ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లు కౌన్సిలింగ్ జరగ్గా, 31న ఎస్జీటీ ఉపాధ్యాయుల కౌన్సిలింగ్ జరగనుంది.

ఇప్పటికే 47 ఆశ్రమ పాఠశాలల్లోని 191 జిపిఎస్ పాఠశాల నుంచి 244 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో ఐదేళ్లు పైబడిన వారు 47మంది ఉపాధ్యాయులు. వీటిలో 12 మంది మెడికల్ గ్రౌండ్లో దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెండేళ్లు పూర్తి చేసిన వారు 155 దరఖాస్తులు. రెండు సంవత్సరాలు లోపు వారు 42 మంది దరఖాస్తులు చేసుకున్నారు. 2026 మే 31న ఉద్యోగ విమరణకు దగ్గరలో ఉన్నవారు ఆరుగురు దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. అదేవిధంగా నాలుగో తరగతి సిబ్బంది బదిలీ కౌన్సిలింగ్‌కు 30 దరఖాస్తులు వచ్చాయి.

జిఒ 22 గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు నష్టదాయం

ట్రాన్స్‌ఫర్ యాక్ట్ 2025 జిఒ 22 ప్రకారం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు నష్టం జరిగింది. గిరిజన సంక్షేమ శాఖలో ఐదేళ్లు దాటిన వారికి బదిలీ తప్పనిసరి. అదే జీవో ప్రాప్తికి జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు 8 ఏళ్లు దాటిన వారికి బదిలీ తప్పనిసరి. ఇద్దరికీ ఒకే జీవో వర్తిస్తుంది. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు సర్వీస్ పాయింట్లు ఇవ్వలేదు. ట్రాన్స్ఫర్ యాక్ట్ నిబంధనలు పాటించలేదు.

కె.కృష్ణారావు,
యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి.

నేడు హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు రేపు ఎస్‌జిటిలకు కౌన్సిలింగ్

సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

బదిలీల్లో నిబంధనలు మార్చాలి : యుటిఎఫ్

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ బదిలీల్లో నిబంధనలు మార్పు చేయాలని పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డికి గురువారం ఐటిడిఎ చాంబర్లో యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ప్రభుత్వ మున్సిపల్ ఉపాధ్యాయులులకు ఇచ్చిన జీవో ఎంఎస్ 22న ఇంప్లిమెంట్ చేయాలన్నారు. హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులకు ఐదు సంవత్సరాలు, మిగిలిన వారికి 8 సంవత్సరాలు బదిలీ కంపల్సరీ చేయాలన్నారు. ఉపాధ్యాయులు బదిలీల్లో సర్వీస్ పాయింట్లు కలపాలన్నారు. బాలికలు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను బదిలీ చేయగా మిగిలిన అన్ని క్యాడర్ పోస్టులను పురుష ఉపాధ్యాయులను కూడా బదిలీ చేయాలన్నారు. ఉపాధ్యాయులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించాలని కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాష్, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కుండంగి కృష్ణారావు, పాలక కృష్ణారావు, కె.సింహాచలం, ఏ ప్రకాశం, ఇమరక సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీల కౌన్సిలింగ్

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్ర, శనివారం గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు కౌన్సిలింగ్ పారదర్శకంగా చేపడుతాం. కావున ఎవరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకూదు.

ఎం.అన్నదొర, డిప్యూటీ డైరెక్టర్,
ట్రైబల్ వెల్ఫేర్, సీతంపేట ఐటిడిఎ.

సబ్‌కలెక్టర్ సమక్షంలో రైతు సంఘం నాయకులు, ఇరిగేషన్ అధికారుల మధ్య జరుగుతున్న చర్చలు

మా పరిధిలో సమస్యలు పరిష్కరిస్తాం

తోటపల్లి ఆధునీకరణ పనులపై ప్రభుత్వానికి నివేదిస్తాం
చర్చల్లో రైతు సంఘం నాయకులతో అధికారులు

ప్రజాశక్తి - పాలకొండ

తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించి ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు, ఎపి రైతు సంఘం నాయకులు సమావేశమయ్యారు. సాగునీరందక రైతులు పడుతున్న ఇబ్బందులను ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి అధికారుల దృష్టి తీసుకెళ్లారు. ప్రతి ఏటా ఖరీఫ్‌కు సాగునీరందడం లేదని చెప్పారు. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో 38 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా ఆరుగురే ఉన్నారని, మిగిలిన 32 మందిని కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో నియమకం జరుగుతుందని ఇరిగేషన్ డి.గనరాజు చెప్పారు. తోటపల్లి ఎడమ కాలువ మెయిన్ షెటర్‌కు రూ.20 లక్షలు నిధులు కేటాయించామని, టెండర్లు కూడా పిలిచామని, 15 రోజుల్లో పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ వారు కూడా వారం రోజుల్లో చేయిస్తామని ఇరిగేషన్ డిఇ హామీ ఇచ్చారు. తమ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. తోటపల్లి ఆధునీకరణ పనులు జరిగితే పూరిస్థాయిలో రైతులకు నీరంతుందని కష్ణమూర్తి అన్నారు. పెద్ద బుడ్డిడి వద్ద సైఫాన్ మదుముల మరమ్మతు పనులు, ఆధునీకరణ పనులతోనే జరుగుతాయని రైతు సంఘం నాయకులు వివరించారు. ఎస్‌డిఎంఎస్ నిధులు రూ.23.54 లక్షలతో పనులు జరిగినా ఎం బుక్‌లో నమోదు చేసి డ్రా చేయడానికి ఎందుకు ప్రయత్నించారని ఇరిగేషన్ అధికారులను కృష్ణమూర్తి నిలదీశారు. మార్చి 31న నిధులు వెనక్కి వెళ్లిపోకుండా పనులు జరిగినట్లు లెక్కలు చూపించి తర్వాత నిధులు వాడుకోవాలని ఉద్దేశంతో అటువంటి చర్యలు చేపట్టామని ఇరిగేషన్ అధికారులు చెప్పడంతో ఆయన తప్పుపట్టారు.

తోటపల్లి ఆధునీకరణ నిధులకు ఎందుకు ఆ విధంగా చేయలేదని లేకుంటే వెనక్కి వెళ్లేది కాదు కదా అంటూ నిలదీశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని, అదేవిధంగా వెంటనే తోటపల్లి ఆధునీకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, పొట్టి మాజీ సర్పంచ్ బెజ్జిపురపు లక్ష్మయ్య, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదు, మాజీ ఎంపిటిసి సభ్యులు కారేపు చిట్టిబాబు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు

5న సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో జూన్ 5న సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వనం మనం కార్యక్రమం కింద జూన్ 5న మొక్కలు నాటే కార్యక్రమంపై గురువారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో పచ్చదనం శాతం పెంచడమే లక్ష్యమని చెప్పారు. జిల్లాలో 38 శాతం పచ్చదనం ఉందని, దాన్ని 50 శాతానికి పెంచాలని యోచిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అటవీశాఖ మొక్కలు పంపిణీ చేయాలని, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉద్యాన శాఖ, అటవీ శాఖ, జలవనరుల శాఖ తదితర శాఖలు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అటవీ అధికారి జిపిపి ప్రసూన, డ్వామా పీడీ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీలో గిరిజనులకు వంద శాతం ఉద్యోగ అవకాశాలు దక్కాలంటే జిఒ 3ను తక్షణమే ప్రభుత్వం పునరుద్ధరించి ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు మండంగి శ్రీనువాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారానికి వచ్చిన సమయంలో నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గల రావాడ జంక్షన్ వద్ద జీవో 3ను తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని ఇచ్చిన మాటను తక్షణమే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఆయువుపట్టుగా ఉన్న జిఒ 3ను రద్దు చేయడంతో గిరిజనులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సిలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో కేవలం 42 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఆదివాసీలకు ఉన్నాయన్నారు. కావున జిఒ 3 అమలు పై ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బి.అనిల్, ఎ.గంగారావు, గిరిజన యువత ఉన్నారు.

కురుపాం : తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

రాష్ట్ర జీపుజాతాను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

ప్రత్యేక గిరిజన డీఎస్సీ సాధనకు కలిసి రావాలి

పార్వతీపురంరూరల్ : మండలంలోని రావికోన పంచాయతీ రంగాలగూడలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులు నిర్వహించాలంటూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.రామస్వామి మాట్లాడుతూ మెగా డీఎస్సీలో ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయింపు ఇవ్వాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజన ప్రాంతాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు జీవో 3 అమలు చేస్తామని ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఈ మెగా డీఎస్సీలో ఏజెన్సీ గిరిజన నిరుద్యోగులకు టీచర్ పోస్టులు దూరం చేశారని విమర్శించారు. ఈ మేరకు ఈనెల 31న రాష్ట్ర జీపు యాత్ర సీతంపేటలో ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి ఏజెన్సీ నిరుద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కద్రక శంకర్రావు, కుసుమూరు గంగన్న, బిడ్డక జగదీష్, పీడక శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టవర్లు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మొబైల్ టవర్స్ పనులను తక్షణం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మొబైల్ టవర్స్ నిర్మాణం గృహ నిర్మాణాల పట్టాలపై గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొబైల్ టవర్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాలో ఇంకా 16 మొబైల్ టవర్ల నిర్మాణం పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలం వడబాయి, కొమరాడ మండలం ఊటకోసు, వనబడి, సాలూరు మండలం సూరపాడు, చోర గ్రామాల వద్ద రహదారుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు జారీ చేశామని, వాటిని త్వరితగతిన పూర్తి చేసి మొబైల్ టవర్ల నిర్మాణం వేగవంతం కావడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తూ బాధ్యతారహితంగా పని చేస్తున్న వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బత్తిలి, కొమరాడ మండలం ఉలికేసు, బదిలీ, టినుకు, సాలూరు మండలంలోని పనసభద్ర పనులకు తక్షణం అంచనాలు సమర్పించాలని ఆయన ఆదేశించారు. అటవీ ప్రాంతంలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్న గృహాలకు అటవీ అనుమతులు జారీ చేసేందుకు నిబంధనలు పరిశీలించాలని, అటవీ అనుమతుల జిల్లా స్థాయి కమిటీ ఇందులో భాగంగా చర్చించింది. 2005 సంవత్సరానికి ముందుగా గ్రామం ఉండాలని జిల్లా అటవీ అధికారి జిపిపి ప్రసూన తెలిపారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, జిల్లా కలెక్టర్ కార్యాలయ విభాగం ఎఒ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్నకలెక్టర్ శ్యామ్ ప్రసాద్

యుద్ధ ప్రాతిపదికన వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని ఉపాధి పనులు చేపట్టి నేటికి 8వారాలు అవుతున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, వెంటనే యుద్ధ ప్రాతిపదికన బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని, పని ప్రాంతాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఎనిమిది వారాలు అవుతున్నా ఉపాధి హామీ డబ్బులు ఇవ్వరా, పేదలు ఆకలి బాధలు పట్టించుకోరా... ఉపాధిహామీ డబ్బులు రాక చేతులో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు ఆవేదన మీకు అర్థం కాదా... తక్షణమే ఉపాధి బకాయి వేతనాలు చెల్లించాలి.. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ మండలంలోని సంత తోట రామన్న చెరువు దగ్గర ఉపాధి కూలీలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శియమ్మల మన్మధరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రెండు నెలల నుంచి ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని చేసిన 14 రోజుల్లో బిల్లులు చెల్లించాల్సి ఉన్నా అలా బిల్లులు చెల్లించకపోవడం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోతే ఉపాధి కూలీలు ఏ విధంగా బతకాలని ప్రశ్నించారు. రెండు పూటలా పనులు వల్ల సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు, గాలులు, పిడుగులు పడే ప్రమాదం ఉందని, కావున ఒక్క పూట పని పెట్టాలని, అలాగే అధికారులు, ప్రభుత్వం బకాయి బిల్లులు తక్షణమే చెల్లించాలని, ఉపాధి కూలీల ఆకలి బాధను అధికారులు, ప్రభుత్వం అర్థం చేసుకోవాలని, లేనిపక్షంలో ఉపాధి కూలీలను కదిలించి స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకరరావు, దేవీ, నారాయణరావు, మోహన్‌రావు, నాయుడు. తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ నిరసన తెలుపుతున్న ఉపాధిహామీ కూలీలు

ఎస్‌డిఎంఎఫ్ నిధులను వెనక్కి రప్పించాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

తోటపల్లి ఎడమ కాలువ ఎస్‌డిఎంఎఫ్ నిధులతో అధికారులు పెద్ద ఎత్తున దుర్వినియోగానికి పాల్పడ్డారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ పనులకై మంజూరైన రూ.23.54 లక్షల నిధుల పనులు జరిగినట్లు, ఎం-బుక్‌లో నమోదు చేసి, బిల్లులు చెల్లించాలని పై అధికార్లకు పంపించినట్లు, బిల్లులు చేసుకొనేందుకు స్కెచ్ చేసినట్లు పలు పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆ శాఖ డిఇని వివరణ కోరామన్నారు. దీనిపై డిఇ స్పందిస్తూ బిల్లులు తయారు చేయడం వాస్తవ మేనని, అందుకు కారణం మార్చి నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలని, లేకుంటే నిధులు వెనక్కి పోయే పరిస్థితి ఉన్నందున, కాలువ పనులు జరిగినట్లు ఎం-బుక్‌లో రాయడం జరిగిందని తెలిపారని అన్నారు. ఇది చాలా పెద్ద కుట్రలో భాగమేనని మండిపడ్డారు. నెలాఖరుకు తోటపల్లి ఎడమ కాలువ నిధులు వెనక్కి వెళ్లిపోకుండా, పనులు జరిగినట్లు లెక్కలు చూపి ఆ నిధులను వాడుకొనే ఉద్దేశ్యంతోనే ఈ తప్పుడు పని చేసినట్లు స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. డిఇ చెప్పినట్లు నిజమైతే గతంలో మంజూరైన తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ నిధులు కూడా వెనక్కి పోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయిం దని, ఇలాంటి ఘన కార్యం చేపట్టి, నిధులను ఎందుకు నిలబెట్టలేకపోయారని ప్రశ్నించారు. డిఇ చెప్పిన మాటలను పక్కన పెట్టి తక్షణమే ఎస్‌డిఎంఎఫ్ నిధుల దుర్వినియోగానికి కుట్ర చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే దీని వెనుక ఉన్న కుట్రదారులను గుర్తించి తగు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలు చెక్కు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని తలవరానికి చెందిన వావిలపల్లి సత్యంనాయుడు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో మృతుని భార్యకు పాలకొండ కోట దుర్గ కళ్యాణ మండపంలో రీజనల్ మేనేజర్ కె.అర్జునరావు, జి టి ఐ డి ఎస్ పి డి జె.రాంబాబు, అడ్వాన్స్ మేనేజర్ డి.ప్రవీణ్ రెడ్డి చేతుల మీదుగా రూ.20 లక్షలు చెక్కు అందజేశారు. ఎపిజిబి శాఖలో రూ.1000 ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ పాలసీ ఉన్నందున చెక్కు అందజేసినట్లు రీజనల్ మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఐసి నోడల్ అధికారి కె.మన్మధరావు, పాలకొండ బ్రాంచ్ మేనేజర్ పి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

31న జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం

పార్వతీపురం : జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఈనెల 31న కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టం, 1989 నియమాలు, 1995 సమీక్షకు హాజరు కావడానికి కావాల్సిన సమాచారం మొత్తం నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నూతన సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ జనరల్ మేనేజర్ వెంకటరమణ

గృహ నిర్మాణాలు వేగవంతం : జిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ జనరల్ మేనేజర్ వెంకటరమణ కోరారు. గురువారం సాలూరు మున్సిపాలిటీ పరిధిలో గల గుమడాం 4, 5 లే-ఔట్లను సందర్శించారు. ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని సైతం అందించిందని ఆయన పేర్కొన్నారు. అదనపు సహాయం పొందిన లబ్ధిదారులు మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. నిర్మాణాలు పూర్తి చేయకపోతే నిబంధనల మేరకు రద్దు చేసే అవకాశాలు ఉంటాయని తెలిపారు. 1550 లబ్దిదారులు అదనపు సహాయం పొందారని చెప్పారు. జూన్ 10లోగా బేస్మెంట్ స్థాయి నుండి లింటెల్ స్థాయికి, లింటెల్ స్థాయి నుండి పైకప్పు వేసే స్థాయికి దశలు మారేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజినీర్ జి.సోమేశ్వరరావు, మున్సిపాల్ కమిషనర్ కృష్ణారావు, హౌసింగ్ సిబ్బంది, పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో పలుచోట్ల వర్షాలు గురువారం కురిశాయి. మండలంలోని దోనుబాయి, పొల్ల, సీతంపేట, ఈతమానుగూడ, తదితర వర్షాలు కురిశాయి. గత వారం రోజులుగా వర్షాలు కురవడంతో అటవీ ఉత్పత్తులైన అల్లం, పసుపు వంటివి ఉత్పత్తులకు అనుకూలమే అయినప్పటికీ ఈ సీజన్లో వచ్చిన పైనాపిల్, అనాస పనసకు దెబ్బ ఉంటుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ధర కూడా పడిపోతుందని దిగులు పడుతున్నారు. మరోవైపు ఇటీవల కాలంలో అధికంగా ఎండలో ఉండడంతో గెడ్డల్లో, ఊట బావుల్లో చుక్క నీరు కూడా లేకపోవడంతో పశువులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది కలిగింది. దీంతో పాటు ఈ వర్షాలు కురవడం వల్ల కొంత పశువు గ్రాసం కొరత కూడా తీరింది. దీంతో పాటు తాగునీటి సమస్య కూడా తీరుతుంది. భూగర్భ జలాలు ఊట బావుల్లో జలకల కనిపిస్తుంది.

సాలూరు రూరల్ : గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు వేసవి దుక్కు లేక ఈ ఏడాది పంటలను సకాలంలో వేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఎప్పుడూ లేని విధంగా మే నెల మొత్తం అప్పుడప్పుడు వర్షాలు పడడంతో చాలామంది రైతులు వేసవి దుక్కులు దున్నించుకోకుండా అలాగే ఖాళీగా భూములను ఉంచాల్సిన పరిస్థితి మండలంలో కనిపిస్తుంది. అలాగే వర్షాలు పడితే సకాలంలో పంటలు వేసుకోలేని పరిస్థితి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు.

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం 8 గంటల నుండే వాతావరణంలో మార్పులు ఏర్పడి అకస్మాత్తుగా కుండపోతగా వర్షం కురవడంతో స్థానిక ప్రజలు తమ రోజువారీ పనులు చేపట్టేందుకు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షపు నీరు చేరుకోవడంతో ఫుట్ పాత్ వ్యాపారులు అవస్థలు పడ్డారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా 90 రోజుల కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫస్ట్ బ్యాచ్‌లో 67 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమానికి బీసీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు.

కొమరాడ: రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఇస్తున్న కుట్టు మిషన్ శిక్షణ సక్రమంగా ఇవ్వాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. కొమరాడలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల్లో మహిళలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కుట్టు మిషన్ల శిక్షణను సద్వినియోగం చేసుకొని మహిళలు కుట్టుమిషన్లు టైలరింగ్ ను నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో సరైన లైట్లు సదుపాయం లేకపోవడంతో నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఇటువంటి ఇబ్బందులు లేకుండా లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసి శిక్షణను పూర్తిగా సౌకర్యవంతంగా అందించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఇందిరా, తదితరులు

మతసామరస్యం, దేశ సమగ్రతకు సిపిఎం కృషి

ప్రజాశక్తి - సీతానగరం

జమ్మూ- కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను టెర్రరిస్టులు బలిగొన్నారు. ఉగ్రవాదం దాడిని ఖండించడంలో దేశ ప్రధాని ప్రదర్శించిన ఐక్యత సమైక్యత స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్కతాటిపై నిలిచేలా చేసిందని సిపిఎం మండల కన్వీనర్ రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని శక్తులు ఉగ్రవాదానికి మతంతో ముడేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయని, ఈ శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 30 వరకు మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సమైక్యతాయాత్రలు జరపాలని తెలిపిందన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అన్ని తరగతులు, మతం, కులం వర్గాల ప్రజలు తీసుకోవాలని, మతపరమైన విభజనకు తావు లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. బిజెపి చేస్తున్న ఈ విభజన రాజకీయాలను ప్రజలంతా తిప్పుకొట్టి మన దేశ సమైక్యతకు ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జి.వెంకటరమణ, బి.అప్పారావు, సిహెచ్.కృష్ణ, పార్టీ సానుభూతిపరులు చుక్క చిన్న, గంగరాజు, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సమైక్యత యాత్రలో పాల్గొనాలని కరపత్రాలు పంపిణీ

వీరఘట్టం: ఉగ్ర దాడిని ఖండిస్తూ చేపడుతున్న సమైక్యత యాత్రలో పాల్గొనాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ఇందిరా కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన 26 మందిని పహల్గాం లో ఉగ్రవాదులు దాడి చేసి చంపారని, అందులో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఈ ఘోర అత్యాకాండకు బలయ్యారని గుర్తు చేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టాలని పథకం పన్నారని, మన విదేశాంగ కార్యదర్శి మతపరమైన విభజన తీసుకురావడానికి ఈ ఉగ్రదాడి జరిగిందని స్పష్టంగా ప్రకటించినట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బకాయి ఉన్న అలవెన్సులను తక్షణమే చెల్లించాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని, డిమాండ్ చేశారు. జులై 9వ తేదీన దేశవ్యాప్త జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, అంగన్వాడి కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సింహాచలం, అంగనాడీలు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం పెరుగుదల

ప్రజాశక్తి - పాచిపెంట

నవధాన్యాలు సాగు చేసి కలియ దున్నడం ద్వారా భూసారాన్ని పెంచవచ్చని భూమిలో ఎంత ఎక్కువ సేంద్రియ పదార్థం ఉంటే అంత ఎక్కువగా రసాయన ఎరువులపై ఆధారపడడం తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. చెరుకుపల్లిలో రైతు మన్యం చంద్రశేఖర్ తన ఐదు ఎకరాల పొలంలో వేసిన ఎక్కువగా పెరిగిన నవధాన్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేలలో ఎన్ని ఎక్కువ రకాలను వేసి కలియ దున్నితే అంతా ఎక్కువ సూక్ష్మజీవులు వేర్ల వ్యవస్థ చుట్టూ చేరి జీవ ద్రవ్యాన్ని పెంచుతాయని, నేలలో ఎంత ఎక్కువగా జీవ వైవిధ్యం ఉంటే నేల అంత ఎక్కువగా సారవంతమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా రైతు చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను 18 రకాల విత్తనాలను కంది, గోంగూర, తోటకూర, అలసందలు, పెసర, మినుము, మొక్కజొన్న, జోడి, గంటి, తెల్లజొన్న వంటి విత్తనాలను చల్లానని, ఇప్పుడు ఏపుగా పెరిగాయని కలియ దున్నిన తర్వాత మూడెకరాల్లో మొక్కజొన్న రెండు ఎకరాల్లో పసుపు పండిస్తానని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ నాగమణి, ఎపి సిఎం అప్ ప్రతినిధులు విజయ్, సురేష్ పాల్గొన్నారు.

యోగాతో జీవనాడులు ఉత్తేజం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

యోగాసనాలతో మానవ జీవనాడులను ఉత్తేజపరుస్తాయని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. గురువారం స్థానిక వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి శిక్షకులు యోగాసనాలపై యోగా గురువు మోహన్ శిక్షణ ఇచ్చారు. ప్రాణాయామంతో పాటు వివిధ భంగిమల యోగాసనాలను వేయించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాసనాలు అలవర్చుకోనేలా యోగా గురువుతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజుల్లో మానసిక ప్రశాంతత, పని ఒత్తిడిని జయించేందుకు యోగా సాధన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. నిత్యం యోగా, ధ్యానం జీవితంలో భాగం కావాలని సూచించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం భాగ్యం కలుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. యోగా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని, ఆరోగ్య ఆంధ్ర సంకల్పాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.

పార్వతీపురం: యోగాలో పాల్గొన్న ఉద్యోగులు, అధికారులు

వ్యక్తపరిచారు. వైద్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సూర్య యోగం శిక్షకులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. అలాగే స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కురుపాం, పాలకొండ, సాలూరులలో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ జగన్మోహనరావు, సిడిపిఒలు బి.శ్రీనివాసరావు, జి.సుగుణకుమారి, ఎస్.సుక్కు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : యోగాతో శారీరక మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎంపిడిఒ జి. ఉమామహేశ్వరి అన్నారు. గురువారం యోగాంధ్రా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బందితో యోగా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం నుంచి కురుపాం ప్రధాన రహదారి మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం చాలా అవసరమని, ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను క్రమం తప్పకుండా ప్రతిరోజు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిఐలో యోగాపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపిడిఒ డిడి మిశ్రా మాట్లాడుతూ యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు నందిని, ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ, ఎఒ మానస తదితరులు పాల్గొన్నారు.

5న సీతంపేటలో

అలాగే జూన్ 5న సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్‌లోనూ, 12న మక్కువ మండలం వెంగళరాయ సాగర్ వద్ద గల ఏనుగు కొండ దగ్గర యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాస్టర్ ట్రైనర్‌ల శిక్షణ పూర్తి చేశామని, గ్రామ, మండల స్థాయిలో యోగా శిక్షకులకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతోందని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా భాగస్వాములై జయప్రదం

కురుపాం: యోగా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చేయాలని ఆయన కోరారు. గ్రామ స్థాయి నుంచి యోగా పోటీలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, తదితర అధికారులు పాల్గొన్నారు.

నేడు తోటపల్లి ఐటిడిఎ పార్క్ వద్ద యోగాంధ్రా

పార్వతీపురం: యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న తోటపల్లి ఐటిడిఎ పార్క్ వద్ద యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో నిర్వహణలో భాగంగా తోటపల్లి ఐటిడిఎ పార్క్ వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

35ఏళ్ల ఉద్యోగ ప్రస్థానం సంతృప్తినిచ్చింది

- 1005 గిరిజన గ్రామాలకు ఒకేసారి విద్యుత్తు సరఫరా చేశాం
- జీవితంలో మర్చిపోలేని మధురానుభూతి
- ట్రాన్స్‌కో ఎస్ఇ కె.చలపతిరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

తన 35 ఏళ్ల ఉద్యోగ ప్రస్థానం చాలా సంతృప్తి నిచ్చిందని ట్రాన్స్‌కో ఎస్ఇ కె.చలపతిరావు అన్నారు. విద్యుత్ శాఖలో ఎఇ నుంచి ఎస్ఇ వరకు అంచెలంచెలుగా ఎదుగుతూ ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తి తో తన ఉద్యోగ జీవితం గురించి ముచ్చటించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

మాది వ్యవసాయ మధ్యతరగతి కుటుంబం. స్వస్థలం శ్రీకాకుళం జిల్లాలోని మందస మండలం బేతాళపురం. తల్లి లక్ష్మమ్మ గృహిణి, తండ్రి జోగారావు రైతు. నాకు ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి ఇంటర్ వరకు ఒడిశాలోని జయపూర్‌లో చదువు సాగింది. మా అమ్మ స్వస్థలం జయపూర్ కావడంతో అక్కడే ఇంటర్ వరకు చదువుకున్నాను. ఆ తర్వాత అనంతపురంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో బిటెక్ ఎలక్ట్రికల్ పూర్తి చేశాను. నాకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు భరద్వాజ్, సందీప్ సాఫ్ట్వేర్ ఇంజినీర్లుగా హైదరాబాద్‌లో ఉన్నారు .

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బోర్డు ద్వారా 1990లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. విజయవాడ థర్మల్ పవర్ కార్పొరేషన్‌లో ఎఇగా మొదటి సారి ఉద్యోగంలో చేరాను. ఏడేళ్లు అక్కడే పని చేశాను. ఆ తర్వాత విజయనగరం ఎడిఇ(కన్ స్ట్రక్షన్)గా చేరి నాలుగేళ్ల పాటు పని చేశాను. అక్కడ నుంచి సాలూరులో ఎడిఇగా నాలుగేళ్లు, రాజాంలో ఎడిఇ గా రెండేళ్లు పని చేశాను. అనంతరం బొబ్బిలిలో డిఇగా పదోన్నతిపై చేరాను. అక్కడ నాలుగేళ్ళు పని చేసిన తర్వాత తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో మూడేళ్ల పాటు డిఇ గా పని చేశాను. ఆ తర్వాత శ్రీకాకుళం డిఇ (ఎంఆర్టి)గా రెండేళ్లు, డిఇగా రెండేళ్లు పని చేశాను. మళ్ళీ శ్రీకాకుళం డిఇ ఎంఆర్టి గా ఏడాది పని చేశాను. అక్కడ నుంచి విశాఖపట్నంలోని కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా ఏడాది పాటు పని చేశాను. శ్రీకాకుళం ఎస్ఇగా నాలుగేళ్లు పని చేసిన తర్వాత మళ్లీ విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో రెండేళ్ల పాటు విధులు నిర్వహించాను. చివరగా పార్వతీపురం మన్యం జిల్లా సర్కిల్ ఎస్ఇగా ఏడు నెలల పాటు పని చేశాను. 35 ఏళ్ల ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా సాగింది. ఉద్యోగ ప్రస్థానంలో భార్య సహకారం, సహచర ఉద్యోగులు, అధికారుల సహకారం మరువలేనిది.



మధుర స్మృతులు

మొత్తం ఉద్యోగ ప్రస్థానంలో సాలూరు ఎడిఇగా నాలుగేళ్లు పని చేసిన కాలంలో 1005 గిరిజన గ్రామాలకు ఒకేసారి విద్యుత్ సరఫరా చేయడం మధురానుభూతిని కల్పించింది. విద్యుత్ అంటే తెలియని గిరి శిఖర గ్రామాలకు వెలుగు నివ్వడం మర్చిపోలేని అనుభవం. ఆ తర్వాత హుదూద్ తుఫాన్ సమయంలో తీవ్రంగా దెబ్బతిన్న విశాఖపట్నంలో విద్యుత్ పునరుద్ధరణకు తనను అమలాపురం నుంచి రప్పించారు. ఆ సమయంలో నేను చేసిన సేవలకు సిఎం చంద్రబాబు నాయుడు ప్రశంసించడం గొప్ప అనుభూతి నిచ్చింది.

'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

జూన్ 4న వెన్నుపోటు దినం జయప్రదం చేయాలని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్న దొర అన్నారు. వైసిపి కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరవాత ఆ హామీలు, పథకాలను గాలికి వదిలి కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. రెడ్‌బుక్ పాలనతో వైసిపి నాయకులను, కార్యకర్తలను హింసిస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఎల్లవేళలా సాగవని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు అవలంభించాలి

పజాశక్తి- సాలూరు రూరల్

రైతులు ఆధునిక పద్ధతులు అవలింభించాలని ఐసిఎఆర్ శాస్త్రవేత్త విశ్వనాథరెడ్డి అన్నారు. వ్యవసాయం చేసే ప్రతి ఒక్క రైతు ఆధునిక పద్ధతులు అవలంబించి వ్యవసాయం చేసినట్లయితే మంచి లాభాలు పొందుతారని తద్వారా దేశం కూడా ప్రగతి పథంలో నడవడానికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. గురువారం మండలంలోని కురుకుట్టి, మామిడిపల్లి, మరిపల్లి గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం రాస్తా కుంటుబాయి వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను, నూతన వంగడాలను అవలంబిస్తూ ఒకే పంట విధానం కాకుండా అంతర్ పంటల వ్యవస్థను ఏర్పరచుకొని సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. శాస్త్రవేత్త డాక్టర్ కేజేశ్వరరావు మాట్లాడుతూ పశుసంపదను కూడా ఆధునిక పద్ధతుల వైపు మల్లాలని బ్లాక్ బెంగాల్ మేకలను పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందుతారని ఈ విధానాన్ని కూడా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ వి.శారద, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.అమృత వీణ, సాలూరు ఎఇఒ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జంఝావతి బాధిత గ్రామాల్లో బైక్‌యాత్ర

ప్రజాశక్తి - కొమరాడ/పార్వతీపురంటౌన్

మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామ సమీపంలో గల జంఝావతి బాధిత గ్రామాల్లో గురువారం జంఝావతి సాధన సమితి ప్రతినిధులు బైక్ యాత్ర నిర్వహించారు. గురువారం పార్వతీపురంలోని రాయగడ రోడ్డు వివేకానంద కాలనీ వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి బైకు యాత్రను జంఝావతి సాధన సమితి కార్యాచరణ కన్వీనర్ మరిశర్ల మాలతి కృష్ణమూర్తి, సమితి ప్రతినిధులు సవరపు రామారావు, వంగల దాలి నాయుడు, పాలక రంజిత్ కుమార్, ఇవి నాయుడు, తీళ్ల గౌరీశంకరరావు, వారణాసి శ్రీహరి, చుక్క చంద్రరావు, సిగడం భాస్కరరావు, ఎన్.బాలరాము, మేడిశెట్టి రామచంద్రరావు, చల్లారపు వెంకట నాయుడు తదితరులతో కలిసి బైక్ యాత్రను ప్రారంభించారు. కొమరాడ మండలంలోని శివిని, విక్రమపురం, అర్తాం, స్వామినాయుడు వలస, గంగ రేగువలస, జంఝావతి జంక్షన్, రాజ్యలక్ష్మీపురం, కంది వలస, కుమ్మరి గుంట, కొత్త కంభవలస, అంకుళ్ళ వలస, సుందరాపురం తదితర గ్రామాల్లో బైక్ యాత్ర సాగింది. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల సర్పంచులు, పెద్దలతో మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా మనల్ని ఊరిస్తున్న జంఝావతి పూర్తిస్థాయి ప్రాజెక్టు సాధనకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రైతులంతా ముక్తకంఠంతో జంఝావతి కావాలని ఎలుగెత్తి కోరితే ప్రభుత్వాలు దిగివచ్చి జంఝావతి ప్రాజెక్టును పూర్తిచేస్తాయన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కేంద్రంలో అనుకూల ప్రభుత్వాలు ఉండడంతో ఈసారి జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో సాధించేందుకు అవకాశం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన నాయకులు, రైతు, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు, రైతు, రైతు సంఘాలు, రైతు కూలీ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జంఝావతి సాధన కోసం శుక్రవారం 9 గంటలకు జంఝావతి ప్రాజెక్టు వద్ద చేపట్టబోయే జల హారతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పలు పార్టీలు జంఝావతి సాధన సమితికి తమ మద్దతు ప్రకటించాయన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని పూర్తిస్థాయి ప్రాజెక్టును సాధిస్తే ఈ ప్రాంతం వెనుకబాటు తనం పోతుందని, వలసలు నివారించబడతాయన్నారు. ముఖ్యంగా పేదరికం పోతుందన్నారు. కావున అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బైక్ ర్యాలీ చేస్తున్న జంఝావతి సాధన సమితి ప్రతినిధులు

కాలువ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి- పాచిపెంట

పాచిపెంట ప్రధాన రహదారి వద్ద కాలువలు నిర్మాణం చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సిఐటియు రైతు సంఘం, ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాచిపెంట ప్రధానరహదారి నిర్మించారని అప్పటి నుండి ఇప్పటివరకు కాలువలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ అధికారులు చెప్పడమే తప్ప పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. దీని కారణంగా ఎస్‌సి వీధులన్నింటిలో చిన్నపాటి వర్షానికి నీరు చేరిపోయి నడవడానికి తిరగడానికి నరకయాతన పడుతున్నారని, ప్రతిరోజు చిన్నపాటి వర్షానికి నీరు తోడుకుంటూ తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి కాలువ నిర్మాణం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కాలువ నిర్మాణం చేయకపోవడం వల్ల నీరు నిల్వ ఉండటంతో దోమలు చేరి అనేక విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి సమస్య పైదృష్టి పెట్టి పై అధికారులకు తెలియజేయాలని కోరారు. కొరటాల శాంతి కుమారి మాట్లాడుతూ ప్రతిరోజు నీరు తోడుకుంటూ నరకయాతన పడుతున్నామని దోమలు చేరిపోయి నడవడానికి చాలా ఇబ్బందిగా ఉందని వెంటనే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలన్నారు. కాలువలు వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టకపోతే ఎంపిడిఒ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

కాలువ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

ఉపాధిహామీ సిబ్బందిపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది పనితీరు పట్ల ఎంపిపి ఉరిటి రామారావుతో పాటు పలువురు సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తా రు. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనుల విషయంలో కనీసం స్థానిక ప్రజా ప్రతి నిధులకు కనీసం తెలియజేయకుండా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని ఎంపిపితో పాటు సంతోష పురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు (రాంబాబు) ప్రశ్నించారు. అలాగే గోశాలల నిర్మాణం చేపట్టి ఏడాదైనా ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సర్వసభ్య మండల సమావేశం గురువారం ఎంపిపి అధ్యక్షతన జరిగింది. టెక్నికల్ అసిస్టెంట్లు, ఎపిఒకు మూవెంట్ రిజిస్టర్ అమలు చేయాల్సి ఉన్నా ఎంపిడిఒ మెతక వైఖరి వల్ల సిబ్బంది బాధ్యత రాహిత్యంగా విధులు నిర్వహించడానికి కారకులయ్యారని పలువురు సభ్యులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గ్రామాల్లో జరుగు తున్న ఉపాధి హామీ పనులు విషయం ప్రజా ప్రతినిధులకు తెలియజేయకుండా నిర్లక్ష్యంగా ఉన్న ఉపాధి సిబ్బందిపై కఠినంగా వ్యవ హరించాలని ఎంపిపితో పాటు పలువురు సభ్యులు ఎంపిడిఒ దృష్టికి తీసుకొచ్చారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రేగిడి విజయభారతి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను సిద్ధం చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైస్ ఎంపిపి బి.లక్ష్మి, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఎంపిటిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), మరడాన సింహాచలం నాయుడు, చింతల రూపవతి, రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), కొమరాడ సిడిపిఒ గొట్టాపు సుగుణ కుమారి, విద్యుత్ శాఖ ఎఇ బడే శ్రీనువాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పట్ల గిరిజనులకు అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజనులకు వారి హక్కులు, బాధ్యతల పట్ల అవగాహనా ఉండాలని విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్సా గిరిజనులు ప్రభుత్వం వారి సంక్షేమానికి పలు సంక్షేమ పథకాలపై అవగాహనా పెంచుకోవాలని సూచించారు. నాగరిక సమాజానికి దూరంగా ఉంటున్న గిరిజనులకు రాజ్యాంగం ద్వారా ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. గిరిజనుల హక్కులు పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోస్ఫిన్, డిఆర్‌డిఎ ఎపిడి సత్యంనాయుడు, టి. జోగారావు, లోక్ అదాలత్ సభ్యులు, మండల లీగల్ సర్వీసెస్ సిబ్బంది కె. సునీత, జి. గంగాదేవి, పారాలీగల్ వాలంటీర్లు, గిరిజనులు పాల్గొన్నారు.

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

పార్వతీపురంటౌన్ : విజయనగరం న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ గురువారం స్థానిక సబ్ జైల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితులు పట్ల ఆరా తీశారు. నాణ్యమైన ఆహారం అందుతుందా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. చక్కటి నడవడిక, నైతిక విలువల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన తెలిపారు. జైలు రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు జడ్జి, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫిన్ పాల్గొన్నారు.

కురుపాం: జియ్యమ్మవలస చినమేరంగిలోని ఎస్సీ, బిసి, గిరిజన సంక్షేమ హాస్టళ్లను అదనపు జడ్జి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫిన్ పరిశీలించారు. విద్యార్థులు పడుకునే గదులు, హాస్టల్ పరిసరాలను, బాత్రూంలు, వంట గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. హాస్టల్ రికార్డులను పరిశీలించారు. హాస్టళ్లను పునఃప్రారంభించినప్పుడు మళ్లీ వస్తానని, అప్పటికి మరమ్మతులు చేయించాలని, ఫ్యాన్లు, లైట్లు సక్రమంగా పని చేసేలా చూడాలని వార్డెన్ శ్రీనివాసరావుకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని, స్వచ్ఛమైన తాగు నీరు అందించాలని ఆమె పేర్కొన్నారు.

పార్వతీపురం: సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి